# అయ్యభౌబోయ్...

- గ్రామాల్లో కుక్కల స్వైర విహారం
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- కానరాని నియంత్రణ చర్యలు

**భీమవరం అర్బన్:** గ్రామాల్లో శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. పల్లెల్లో రోజురోజుకూ వాటి బెడద ఎక్కువవుతుంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా కుక్కలు గుంపులుగుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వీధుల్లో తిష్టవేసి పిల్లలు, వృద్ధులపై దాడులకు దిగుతున్నాయి. దీంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. కుక్కకాటుకు గురై ఆస్పత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వీటిని నివాస ప్రాంతాలకు దూరంగా తరలించడం గాని, నియంత్రించడం గాని చేయకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. భీమవరం నియోజకవర్గంలో గ్రామాల్లో కుక్కల సంఖ్య భారీగా పెరిగిపోయింది. కుక్కల నియంత్రణ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టకపోవడంతో వాటి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఎక్కడికక్కడ గ్రామ సింహాలు మనుషులపై దాడులు దిగుతున్నాయి. చాలా మంది కుక్క కాటుకు గురవుతున్నారు. మండలంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో రోజురోజుకు కేసులు పెరుగుతున్నాయి.

**రాత్రులు సమయంలో**

రాత్రి సమయంలో బయటకు రావాలంటేనే గ్రామస్తులు బెంబేలెత్తిపోతున్నారు. అంతేకాకుండా వాహనదారులను వెంబడించి మరీ పిక్కలు పట్టుకుంటాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రేబిస్ వ్యాధి సోకితే అంతే**

కుక్క కాటు వల్ల రేబిస్ వ్యాధి సోకే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎవరినైనా కుక్క కరిస్తే వెంటనే రేబిస్ వ్యాధి సోకకుండా వ్యాక్సిన్ వేయించాలని, ఈ వ్యాధి సోకితే మనిషి చనిపోయే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు.

**ముందుకు సాగని కుక్కల నియంత్రణ**

గ్రామాల్లో కుక్కల నియంత్రణ కార్యక్రమం ముందుకు సాగడం లేదు. కుక్కల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టడంతో వాటి సంఖ్య ఘననీయంగా తగ్గేది. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు.



దొంగపిండిలో గుంపులు, గుంపులుగా కుక్కలు తిరుగుతున్న దృశ్యం

## క్లుప్తంగా

### నడివీధికి చేరిన పోలేరమ్మ



గరగ నృత్యాలతో పోలేరమ్మను నడివీధికి తీసుకువెళుతున్న భక్తులు

**ఉండి:** మండలంలోని యండగండిలో ప్రతిఏటా నిర్వహించే పోలేరమ్మ జాతర మహోత్సవాల నిర్వహణకు శనివారం అంకుర్పాణ చేశారు. గ్రామస్తులు పోలేరమ్మ అమ్మవారిని శాస్త్ర ప్రకారం ఘనాచారుల ఇంటి వద్ద నుంచి నడివీధికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నడివీధిలో అమ్మవారికి గ్రామ ప్రజలు,పెద్దలంతా ప్రత్యేక పూజలు చేశారు.

### ఏడాది పొడవునా సీపీఐ శతాబ్ది ఉత్సవాలు



ఉండిలో శతాబ్ది ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న సీపీఐ నాయకులు

**ఉండి:** సీపీఐ శతాబ్ది ఉత్సవాలను 2025 డిసెంబర్ 26 వరకు అనగా ఏడాది పొడవునా నిర్వహించుకోవాలని పార్టీ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. శనివారం ఉండి సీపీఐ కార్యాలయంలో ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భావం 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో జరిగిందన్నారు. సీపీఐ వందేళ్ల ప్రస్థానంలో అనేక పోరాటాలు చేసి ప్రజాపక్షంగా నిలిచామని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, నాయకులు సనపల శ్రీనివాస్, పున్నాని అప్పారావు, బైరెడ్డి వెంకట్రావు, యడ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న క్రిస్మస్ సంబరాలు



ఎన్నార్పీ అగ్రహారంలో క్రిస్మస్ క్యారల్స్ నిర్వహిస్తున్న చిన్నారులు

**ఉండి:** క్రిస్మస్ సంబరాలు మండల వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. ప్రతిరోజూ మండలంలోని ఏదో గ్రామంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి ఎన్నార్పీ అగ్రహారంలో ట్రినిటీ లూథరన్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం సండేస్కూల్ టీచర్స్ చెల్లుబోయిన సుధారాణి, ముత్యం శ్రీవల్లి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున క్రిస్మస్ క్యారల్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు.


### జనవిజ్ఞాన వేదిక సైన్స్ క్యాలెండర్ విడుదల



పెదఅమిరంలోని మిత్ర మెడికేర్ ఆసుపత్రిలో సైన్స్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**కాళ్ల:** మండలంలోని పెదఅమిరంలోని మిత్ర మెడికేర్ ఆసుపత్రిలో ఆంధ్రప్రదేశ్ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ క్యాలెండర్‌ను ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ చుండూరి సాయిబాబు శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని, సైన్స్‌పై అభిరుచిని పెంపొందించడానికి అనేక కార్యక్రమాలను చేపడుతుందని వివరించారు. కార్యక్రమంలో చుండూరిమల్లీశ్వరి, విక్రాంత్, ప్రియాంక, ప్రశాంత్, శ్రీ వర్ధన్, చింతపల్లి ప్రసాదరావు, జె.రామలక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



రక్తదానం నిర్వహిస్తున్న దృశ్యం

**భీమవరం (ప్రకాశంచౌక్):** ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పలువురు వక్తలు తెలిపారు. రిలయన్స్ గ్రూప్ ఫౌండర్ ధీరుభాయ్ అంబానీ జయంతి సందర్భంగా శనివారం భీమవరంలోని రిలయన్స్ డిజిటల్ నందు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. భీమవరం రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 16 మంది రక్తదానం చేశారని నిర్వాహకులు తెలిపారు.

### ఆకాశంలో భారత్ మేఘాకృతి



ఆకాశంలో భారత్ మేఘాకృతి

ఆకాశంలో శనివారం సాయం సంధ్యవేళ ఆకాశంలో ఇండియా మ్యాప్ ఆకృతిలో మేఘం సూర్యుడి చుట్టూ వెలసినట్లుగా కన్పిస్తుంది. బ్రిటీష్ కాలానికి ముందునాటి భారత దేశం దృశ్యంలాగా ఉంది ఆ ఆకృతి. పలువురు ఆసక్తిగా దీనిని పలువురు తిలకించారు. - ఆకివీడు

## కష్టపడే వారికే వైఎస్సార్‌సీపీలో గుర్తింపు

**భీమవరం:** పార్టీకి అంకిత భావంతో పని చేస్తున్న కార్యకర్తలు, నాయకులకు వైఎస్సార్ సీపీ ఎప్పుడూ అండగానే ఉంటుందనటానికి గురువారం పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రకటించిన కమిటీ సారథులే నిదర్శనం. దీనిలో భాగంగా వైఎస్సార్ సీపీ భీమవరం పట్టణ అధ్యక్షుడిగా గాదిరాజు రామరాజు, వీరవాసరం, భీమవరం రూరల్ మండల అధ్యక్షులుగా చవ్వాకుల సత్యనారాయణ, జల్లా కొండయ్యలను నియమించారు. జిల్లా కమిటీలో ఉపాధ్యక్షునిగా మేడిది జాన్సన్(భీమవరం), ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కలిదిండి బలరామరాజు(వెంప), గోడి షణ్ముఖరావు( మత్స్యపురి), సెక్రటరీ యాక్టివిటీలుగా పి నర్సింహస్వామి, కాండ్రేగుల శ్రీను (కొణితివాడ), పార్టీ అధికారప్రతినిధిగా కామన నాగేశ్వరరావు(భీమవరం) నియమితులయ్యారు.



గాదిరాజు రామరాజు



చవ్వాకుల సత్యనారాయణ



జల్లా కొండయ్య



మేడిది జాన్సన్



కలిదిండి బలరామరాజు



పి నర్సింహస్వామి



కాండ్రేగుల శ్రీను



కామన నాగేశ్వరరావు

## వైఎస్సార్ సీపీ పోరుబాట విజయవంతం

**ఆకివీడు:** విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్ సీపీ ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గంలో నిర్వహించిన పోరుబాటు విజయవంతమైందని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పీవీఎల్ నర్సింహరాజు శనివారం విలేకరులకు తెలిపారు. ఆకివీడు సబ్ స్టేషన్ వద్దకు నియోజకవర్గ నలుమూలల నుంచి వచ్చిన కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, విద్యుత్ వినియోగదారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని విస్మరించి, పెనుభారం మోపడంతో ప్రజల తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారని పోరుబాట స్పష్టం చేసిందన్నారు. ప్రజా వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని పీవీఎల్ డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు సంపద సృష్టిస్తామని చెప్పి ప్రజలపై భారీగా భారం వేయడం తగదన్నారు. ఇదే ధోరణి కొనసాగితే భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలు చేపట్టక తప్పదని హెచ్చరించారు. పోరుబాట కార్యక్రమం ఆకివీడు నుంచి పాదయాత్రగా వెళ్లి సబ్ స్టేషన్ వద్ద భారీ ధర్నా చేయడంతో ప్రజా వ్యతిరేకత బయటపడిందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి చెప్పారు. కరెంట్ చార్జీల పెంపుపై ప్రజా వ్యతిరేకతతో ప్రభుత్వం కళ్లు తెరవాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు, ఇతర వాగ్దానాలను అమలుజేయాలని విజ్ఞప్తిచేశారు. మండల, పట్టణ కమిటీ అధ్యక్షులు నంద్యాల సీతారామయ్య, అంబటి రమేష్ మాట్లాడుతూ పోరుబాట విజయవంతంపై సంతృప్తి వ్యక్తంచేశారు.



పీవీఎల్ నర్సింహరాజు

## చర్యలు లేకుండా సదస్సులు ఎందుకు?

**ఆకివీడు:** రీ సర్వేలో తమ భూముల్లో లోపాలను సూచిస్తూ సర్వే చేశారని, వాటిని సరిజేయలని పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవెన్యూ సదస్సులు ఎందుకు అని రైతులు, నాయకులు, సర్పంచ్ రెవెన్యూ అధికారుల్ని నిలదీశారు. మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతులు మంతెన పద్మనాభరాజు, దాట్ల సుబ్బరాజు, రంగరాజు, అల్లూరి వేణుగోపాలరాజు, మేకా సత్యవతి మాట్లాడుతూ ఇప్పటికే నాలుగైదు పర్యాయాలు ఫిర్యాదులు చేసినా, సర్వేలో లోపాల్ని సరిదిద్దలేదని ఆవేదన వ్యక్తంచేశారు. సర్వేలో లోపాల వల్ల భూములు కొనుగోలు, అమ్మకాలు వంటి వాటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నామని సర్పంచ్ నందమూరి ప్రకాశం, గ్రామ పెద్ద కలిదిండి నగేష్‌రాజు ఆవేదన వ్యక్తంచేశారు. అమ్మకాలు జరుగుతున్న భూములకైనా మళ్ళీ సర్వే చేసి, దస్తావేజు ప్రకారం భూములు అప్పగించాలని డిమాండ్ చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు సమాధానం చెప్పాలని నిలదీశారు. సమావేశానికి హాజరైన డిప్యూటీ తహసీల్దార్ ఫరూక్ మాట్లాడుతూ 30 రోజుల్లో భూములను సర్వే చేయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు, నాయకులు శాంతించడంతో సదస్సును ముగించారు. సదస్సులో 20 ఫిర్యాదులు అందినట్లు రెవిన్యూ అధికారి మన్నే శ్రీనివాసరావు చెప్పారు. సదస్సులో నీటి సంఘం అధ్యక్షులు మంతెన మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆకివీడు: చెరుకుమిల్లి రెవెన్యూ సదుస్సులో మాట్లాడుతున్న రైతులు

## విద్యార్థుల్లో శాస్త్రీయ స్ఫూర్తిని పెంపొందించాలి

**భీమవరం:** భీమవరం పట్టణంలోని శ్రీవిష్ణు ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాల విద్యార్థులలో శాస్త్రీయ స్ఫూర్తిని పెంపొందించే ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని ఏఆర్‌కేఆర్, బీహెచ్‌వీఎస్ఆర్ మునిసిపల్ పాఠశాలలకు చెందిన 250 మంది 8,9 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు, ఇన్‌ఫెక్షన్ నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యనిపుణులు వివరించారు. అనంతరం విద్యార్థులకు వివిధ డయాగ్నొస్టిక్ సాంకేతికతలను ప్రదర్శించి బ్లడ్ గ్రూపింగ్, హిమోగ్లోబిన్, బీపీ వంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ కెఎస్ నటరాజ్, ప్రాజెక్ట్ పరిశోధకుడు ఎస్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విష్ణుఫార్మశీ కళాశాల విద్యార్థులు బ్లడ్ గ్రూపింగ్, హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తున్న దృశ్యం

## విజయకుమార్‌కు అవార్డు

**ఆకివీడు:** ఉపాధ్యాయుడు, కవి, రచయిత పెంకి విజయ కుమార్‌ను ప్రపంచ తెలుగు మహాసభలో ఘనంగా సత్కరించారు. విజయవాడలోని కేబీఎస్ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో జాషువా సమగ్ర రచనల మానవత విలువలు అనే సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించి నాగార్జున యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందిన పెంకి వందలాది రచనల ద్వారా తన తెలుగు పాండిత్యాన్ని ప్రజలకు చాటారని సభికులు ప్రసంశించారు. ఈ సందర్భంగా సాహితీ వేత్త డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ సత్కరించి, జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక జెడ్పీ స్కూల్‌లో పనిచేస్తున్న విజయకుమార్‌ను తోటి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తోట పోతరాజు, సాహితీవేత్తలు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న పెంకి విజయకుమార్

## సివిల్స్ పరీక్షల్లో కఠోర శ్రమ అవసరం

**భీమవరం:** విద్యార్థులు సివిల్స్‌లో విజయం సాధించాలంటే కఠోర శ్రమతోపాటు జనరల్ నాలెడ్జ్‌లో మంచి స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని నారాయణ ఐఏఎస్ అకాడమీ ప్రిన్సిపల్ సతీష్ అన్నారు. శనివారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నారాయణ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో నావిగేటర్ సివిల్ సర్వీసెస్‌పై ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ బీహెచ్‌వీఎస్ రామకృష్ణంరాజు మాట్లాడుతూ సీవిల్స్‌లో ప్రధానంగా ప్రిలిమ్స్ మెయిన్స్ ఇంటర్వ్యూ దశలపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం కళాశాలలో మూడవ సంవత్సరం చదువుతున్న ఈసీ విద్యార్థి పూర్ణచంద్రకు వరల్డ్ యూత్ స్కిల్స్ డే సందర్భంగా బెస్ట్ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉమెన్ సెల్ కోఆర్డినేటర్ పి.భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఆర్‌కేఆర్ కళాశాల విద్యార్థికి అవార్డు అందజేస్తున్న దృశ్యం

## హోటళ్లలో మున్సిపల్ అధికారుల తనిఖీలు

**భీమవరం(ప్రకాశం చౌక్):** భీమవరంలో పలు హోటళ్లను మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రా రెడ్డి శనివారం తనిఖీ చేశారు. ముందుగా ఉండి రోడ్డులోని విజయమెస్‌ను ఆయన తనిఖీ చేశారు. విజయమెస్‌లో అపరిశుభ్ర వాతావరణంలో వంటలు తయారు చేయడం, రంగు పదార్థాలతో ఆహారం తయారు చేయడం కమీషనర్ ఆగ్రహం వ్యక్తం చేసి, హోటల్‌కు జారిమానా విధించి మూసి వేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే అజంత హోటల్ ,అరుణ్ టిఫిన్ సెంటర్‌ను కూడా తనిఖీ చేసి హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ వెంకటేశ్వరరావు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విజయమెస్‌లో తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమీషనర్ రామచంద్రారెడ్డి

## దాతల సేవలు అభినందనీయం

**భీమవరం:** గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు తెలిపారు. భీమవరం పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయానికి శనివారం వివిధ పోటీ పరీక్షల పుస్తకాలను దాతలు అందజేశారు. గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ పొందే అభ్యర్థులకు ఉపయోగపడే సుమారు రూ.8,555 విలువకలిగిన గ్రూప్ -1, గ్రూప్-2, డీఎస్సీ, ఆర్ఆర్‌బి, కంప్యూటర్ బుక్స్‌ను దాతలు దాట్ల నవీన్ కుమార్‌వర్మ, కొత్తపల్లి రామ కృష్ణంరాజు గ్రంథాలయాధికారి ఎస్ వెంకటేశ్వరరావుకు అందజేశారు. డీవీ చంద్రాజీ అధ్యాత్మిక పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ కోశాధికారి గ్రంధి కుమారవెంకటేశ్వరప్రసాద్, విజ్ఞాన వేదిక సేవాసంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్, ఇందుకూరి శివాజీవర్మ, అరసవల్లి మణికంఠ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలోని వైఎస్సార్ శాఖా గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

## సౌత్‌జోన్ హాకీ పోటీలకు విష్ణు విద్యార్థి ఎంపిక

**భీమవరం:** కాకినాడ జేఎన్‌టీయూ యూనివర్సిటీలో ఈనెల 27వ తేదిన నిర్వహించిన జేఎన్‌టీయూకే హాకీ సెలక్షన్స్‌లో భీమవరం పట్టణంలోని విష్ణు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి కాటూరి జాయ్ వెస్లీ జేఎన్‌టీయూకే టీమ్‌కు ఎంపికయ్యాడని కళాశాల పీడీ ఎం శ్రీనివాసరావు విలేకర్లకు చెప్పారు. శనివారం కళాశాలలో జాయ్‌వెస్లీని అభినందించిన సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వచ్చే నెల 3వ తేది నుంచి 5రోజులు పాటు చెన్నైలోని యూనివర్శిటీ మద్రాస్‌లో నిర్వహించే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ హాకీ పోటీల్లో పాల్గొంటాడని వివరించారు. అనంతరం క్రీడాకారుడ్ని కళాశాల ప్రిన్సిపాల్ ఎం వేణు, వైస్ ప్రిన్సిపాల్ ఎం శ్రీలక్ష్మి తదితరులు అభినందించారు.



హాకీ పోటీలకు ఎంపికైన జాయ్‌వెస్లీని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

## దాసాంజనేయుని హుండీ ఆదాయం లెక్కింపు

**భీమవరం(ప్రకాశం చౌక్):** భీమవరం పట్టణంలోని మారుతీ సెంటర్‌లో శ్రీ దాసాంజనేయ స్వామి వారి హుండీను శనివారం లెక్కించారు. 5 నెలల కాలమునకు రూ 1,82,392లు ఆదాయం వచ్చిందని ఈఓ గొట్టుముక్కల నాగ సీతారామరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ మంగ దొడ్డి శ్యాంసుందర్, దేవాదాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

## వైభవంగా ఊంజల్ సేవ

**కాళ్ల:** మండలంలోని కాళ్లకూరులో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శనివారం స్వామి, అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ సేవ, అష్టోత్తర శతనామార్చన, ఊంజల్ సేవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి, స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ధనుర్మాసం శనివారం కావడంతో తెల్లవారుజాము నుంచి ఆలయానికి వచ్చిన భక్తులతో ఆలయ ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈఓ ఎం.అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఊంజల్ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

### నేడు హైందవ శంఖారావానికి మద్దతుగా పాదయాత్ర

**ఉండి:** హిందూ దేవాలయాల స్వయం ప్రతిపత్తి కోసం జనవరి 5న విజయవాడ హైందవ శంఖారావ సభను నిర్వహించనున్నారని హిందూపరిరక్షణ సమితీ నాయకుడు సన్నిధిరాజు చలపతిరావు తెలిపారు. ఈ సభకు మద్దతుగా ఆదివారం ఉండిలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 8:30 గంటల నుంచి ఉండి బస్టాండ్‌కు ఎదురుగా వున్న శ్రీరామక్షేత్రం వద్ద నుంచి నిర్వహించే పాదయాత్రలో హిందువులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

### 3న కలెక్టరేట్‌కు రావాలని రైతులకు నోటీసులు

**ఆకివీడు:** జాతీయరహదారి నంబర్ 165కు ఉప్పుటేరు వద్ద నుంచి అజ్జమూరు గరువు వరకూ బైపాస్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూమి సేకరణకు సంబంధించి రికార్డు దఖలపరిచేందుకు జనవరి 3న భీమవరం కలెక్టర్ కార్యాలయంలో హాజరుకావాలని సంబంధిత భూమి యజమానులకు నోటీసులు జారీ చేశారు. మండలంలోని దుంపగడప, ఆకివీడు, అజ్జమూరు గ్రామాల్లో సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలోని భూమిని జాతీయ రహదారుల అథారిటీ సేకరించేందుకు గతంలోనే నిర్ణయం తీసుకున్నారు. భూమి విలువల్లో తేడాలు వల్ల ఆయా ప్రాంతాల్లోని రైతులు కోర్టుకు వెళ్లడంతో కొంత జాప్యం జరిగింది. కోర్టు ఆదేశాల అనంతరం జిల్లా కలెక్టర్ ఆయా భూమి యజమానులు, కొనుగోలు దారులు సుమారు 87 మందికి నోటీసులు జారీ చేశారు. తమ వద్ద ఉన్న దస్తావేజులు, ఇతర రికార్డులను కలెక్టర్ కార్యాలయంకు తీసుకురావాలని సూచించారు.

### జాబ్‌మేళాలో 18 మందికి ఉద్యోగాలు

**ఆకివీడు:** మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన జాబ్ మేళాలో 18 మంది నిరుద్యోగులు ఉద్యోగం సంపాదించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత చెప్పారు. జాబ్ మేళాకు 30 మంది నిరుద్యోగులు హాజరయ్యారన్నారు. అపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్ సంస్థలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో స్కిల్ డవలప్‌మెంట్ కోఆర్డినేటర్ కే.ఆనంద కుమార్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ జీడీ.శ్రీనివాస్‌కుమార్ పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**ఉండి:** మండలంలోని యండగండిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గణపవరం మండలం అప్పనవీడు గ్రామానికి చెందిన సింగిడి పవన్ కుమార్ గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాధితుడు ఈ నెల 26న భీమవరంలో వెళ్లి వస్తుండగా యండగండిలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించిగా మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రి నుంచి నుంచి అందిన సమాచారం ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు.

### సీఎస్సీ వెబ్‌సైట్ సామర్థ్యాన్ని పెంచాలి

**భీమవరం:** ఉపాధ్యాయుల సర్వీస్ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చడానికి, సరి చేసుకోడానికి ఏర్పాటు చేసిన సీఎస్సీ వెబ్‌సైట్- టిఐఎస్ సర్వర్ సామర్థ్యాన్ని పెంచాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జి ప్రకాశం, బివి నారాయణ శనివారం ఒక ప్రటనలో విద్యాశాఖాధికారులను కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులంతా ఒకేసారి ఆన్‌లైన్ నమోదుకు సన్నద్ధం కావడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. అందువల్ల విద్యాశాఖ జిల్లావారి టైం లైన్‌తో టిఐఎస్ సర్వర్స్ ద్వారా నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, పని సర్దుబాటు వంటి కార్యక్రమాలు వేగవంత నిర్వహణ కోసం అందుబాటులోకి తేనున్న సేవల గడువు పొడిగించాలని ప్రకాశం, నారాయణ కోరారు.